నమో.. నారసింహ

- కన్నుల పండువగా నృసింహుని కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్ యాస్మిన్‌బాషా
- వివిధ రాష్ట్రాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన భక్తజనం





శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, తాళిబొట్టు చూపెడుతూ..

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ వేదపండితులు ప్రత్యేకపూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం శేషప్ప వేదికపై నృసింహుని కల్యాణం కన్నులపండువగా జరిపించారు. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాలశర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేకపూజలు చేశారు. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణం తిలకించి తరించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు వేడుకలు వైభవంగా జరిపించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్ మకరంద, మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్, డీసీఎమ్మెస్ చైర్మన్, జెడ్పీటీసీ బత్తిని అరుణ, అయ్యోరి రాజేశ్, రెనోవేషన్ కమిటీ సభ్యుడు ఇందారపు రామయ్య, ఎంపీపీ జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.





స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎంపీ వెంకటేశ్ నేత



భక్తులకు అన్నదానం చేస్తున్న అతిథులు



వేడుకలకు హాజరైన అదనపు కలెక్టర్ మకరంద్ తదితరులు



నృసింహుని కల్యాణోత్సవం అనంతరం ప్రత్యేకపూజలు చేస్తున్న వేదపండితులు



ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవానికి తరలివచ్చిన అశేష భక్తజనం

వృత్తిలో ఆదర్శం.. ప్రవృత్తిలో నైపుణ్యం

కరీంనగర్ అర్బన్: వృత్తి, ప్రవృత్తుల సంగమమంటే ఈ అధికారులు గుర్తొస్తారు. ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వీరిది ఒక్కొక్కరిది ఒక్కో శైలి. విధి నిర్వహణలో ప్రజలకు సేవలందిస్తూనే.. తమ అభిరుచులకు తగ్గట్టు జీవిస్తున్నారు. ఒత్తిడిని మరిచి ఉల్లాసంగా గడుపుతున్నారు. తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకరు సాహసాలకు చిరునామాగా నిలిస్తే.. మరొకరు పాటల పూదోటలో కోయిలలుగా రాణిస్తున్నారు. ఇంకొకరు వ్యాఖ్యానం చేస్తూ మాటల మాంత్రికుడిగా ముఖ్యులతో అభినందనలు పొందుతున్నారు. మరో అధికారి ఫ్లూట్‌ను వినసొంపుగా వినిపిస్తూ.. ఆకట్టుకుంటుండగా మరొకరు నటనతో రంజింపజేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలోని పలువురు ద్విపాత్రాభినయ అధికారులపై సండే స్పెషల్..

- ఆదర్శంగా నిలుస్తున్న జిల్లా అధికారులు
- ఓవైపు విధులు.. మరోవైపు అభిరుచుల ప్రస్థానం
- ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రత్యేకత



బంగీ జంప్ చేస్తున్న జీవీ.శ్యాంప్రసాద్‌లాల్

సాహసాలకు కేరాఫ్ శ్యాంప్రసాద్‌లాల్



కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ రచయితలు, కవులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంటారు. అదే సమయంలో సాహసాలకూ చిరునామాగా నిలుస్తున్నారు. యువకులతో పోటీ పడుతుంటారు. నిత్యం విధి నిర్వహణలో సమీక్షలు, తనిఖీలతో బీజీగా ఉంటున్నా.. వీలు చిక్కినప్పుడల్లా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలను సందర్శిస్తుంటారు. ఉత్తరప్రదేశ్‌లో ఓ సారి బంగిజంప్ కూడా చేసి ఔరా అనిపించారు. సాహస క్రీడలైన కనోయింగ్‌తోపాటు అడవుల్లో నిర్వహించే వివిధ అంశాల్లో పాల్గొంటున్నారు.

సంకీర్తనల పూదోట ప్రియాంక



జెడ్పీ సీఈవో సీహెచ్.ప్రియాంక విధినిర్వహణలో బిజీగా ఉంటున్నా.. ఏ మాత్రం విరామం దొరికితే చాలు.. తన స్వరానికి పనిచెబుతుంటారు. కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సతీమణి అయిన ఈమె ఇటీవలే ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉన్నాయంటే చాలు ఈమె భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుంది. చిన్నతనం నుంచే సంగీతం నేర్చుకున్న ప్రియాంక.. బ్రహ్మోత్సవాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాటలు పాడుతూ అలరిస్తుంటారు. ఇటీవల కరీంనగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో 'ముద్దుగారే యశోద' అంటూ ఆలపించిన సంకీర్తనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

గళం విప్పితే కరతాళ ధ్వనులే..



తన గళంతో మంత్రముగ్ధులను చేయడం బాలశ్రీనివాస్‌కే సొంతం. రాజన్న సిరిసిల్ల సీపీవో పెండోట బాలశ్రీనివాసాచారి బాల్యం నుంచే సరిగమలను ఔపోసన పట్టగా వేదిక దొరికిందంటే చాలు పాటలతో మైమరిపింపజేస్తారు. ఈయనది మానకొండూరు మండలం వేగురుపల్లి. కరీంనగర్‌లో స్థిరపడ్డారు. తన తాత కట్ట లక్ష్మీనర్సయ్య ఆల్‌ఇండియా రేడియో ఆర్టిస్ట్. ఆయన వద్ద సంగీతం నేర్చుకుని చదువుకునే వయసు నుంచి పాటలు పాడి బహుమతులు అందుకున్నారు. జానపదం, సినీగీతాలు, పౌరాణిక గాథలను వినసొంపుగా వినిపిస్తుంటారు.

పాతమధురాల గీతం మంజుల



కరీంనగర్ బాల భవన్ సూపరింటెండెంట్ కట్ట మంజులాదేవి ప్రభుత్వ అధికారిగా కన్నా గాయకురాలిగానే మంచి గుర్తింపు పొందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అధికారుల్లో మంజులాదేవిది ప్రత్యేకస్థానం. ప్రతి గణతంత్ర, స్వాతంత్య్ర, రాష్ట్ర అవతరణ వేడుక సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగే తేనీటి విందులో ఈమె పాట ఉండాల్సిందే. ఎంత ఒత్తిడిలో ఉన్నా పాటతో మనసు తేలిక అవుతుందంటారు మంజుల. ఈమె రాజన్న సిరిసిల్ల సీపీవో శ్రీనివాసాచారి సతీమణి కావడం గమనార్హం.

ఫ్లూట్ పట్టారంటే సంగీత ప్రవాహమే



శంకరపట్నం తహసీల్దార్ గూడూరి శ్రీనివాసరావుది చొప్పదండి మండలం కాట్నపల్లి. చదువుకునే రోజుల్లో టీవీల్లో ఫ్లూట్ ఊదుతుండడాన్ని గమనించి ఆసక్తి పెంచుకున్నారు. ఎంసెట్‌కు దరఖాస్తు చేస్తానని ఇంట్లో చెప్పి హైదరాబాద్ వెళ్లి ఫ్లూట్ కొనుక్కున్నారు. వాయిద్యకారుడు కంచర నారాయణ వద్ద ఓనమాలు నేర్చుకుని అప్పటినుంచి ఫ్లూట్ వినిపిస్తున్నారు. ఏ మాత్రం విరామం దొరికినా ఫ్లూట్ పడుతుంటారు. సంగీతాన్ని పాటను మేళవించి ఫ్లూట్‌ను వాయించడం ఇతనికే సొంతం.

కాళి పంచ్ కొడితే పతకమే





జగిత్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్ మడిపల్లి కాళిచరణ్‌గౌడ్‌ది నగరంలోని సిక్‌వాడీ. చిన్నతనంలోనే బాక్సింగ్‌పై అభిరుచి ఎక్కువ. తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నా.. ఇప్పటికీ పంచ్‌పైనే ధ్యాస. విశ్వవిద్యాలయం స్థాయిల్లో పలుమార్లు మెడల్స్ సాధించిన ఆయన శాఖాపరమైన క్రీడల్లోనూ పతకాలు అందుకుంటున్నారు. ప్రస్తుతం యువ బాక్సర్లను తయారు చేస్తున్నారు.

ఎత్తు వేస్తే చిత్తవ్వాల్సిందే



చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పీఏగా ఉన్న నాయబ్ తహసీల్దార్ కానిపర్తి మనోహర్‌రావుది కరీంనగర్‌లోని వావిలాలపల్లి. బాల్య దశలోనే చదరంగంపై మక్కువ పెరగడంతో డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేవారు. స్వతహాగా చదరంగంలో మెలకువలు నేర్చుకుంటూనే రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉద్యోగం చేస్తూనే శాఖాపరంగా నిర్వహించే క్రీడలో పాల్గొంటూ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఆలిండియా, స్టేట్ విభాగాల్లో ప్రథమ స్థానం పొందారు.

మాటల మాంత్రికుడు గోపాల్



ఉమ్మడి జిల్లాలో వ్యాఖ్యానమంటే మాడిశెట్టి గోపాల్ పేరే వినిపిస్తుంది. కరీంనగర్‌కు చెందిన గోపాల్‌ది ఎల్‌ఐసీలో హయ్యర్‌గ్రేడ్ అసిస్టెంట్ హోదా. అటు విధి నిర్వహణ.. ఇటు ప్రవృత్తిని కొనసాగిస్తూ గుర్తింపు పొందారు. గణతంత్ర, స్వాతంత్య్ర, రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో వినిపించే మాటలు ఇతనివే. అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్.రాజశేఖర రెడ్డి జిల్లా పర్యటనల సమయంలోనూ తన వ్యాఖ్యానం ద్వారా అభినందనలు పొందారు. మలేసియా, సింగపూర్‌లోనూ వ్యాఖ్యానం చేశారు. ఉత్తమ వ్యాఖ్యాతగా అనేక అవార్డులు పొందారు. దీనితోపాటు కవి, రచయిత, నటుడిగానూ రాణిస్తున్నారు.

న్యూస్‌రీల్

అన్యాయాన్ని ఎదిరించాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రసాద్

జగిత్యాలజోన్: అన్యాయం జరిగితే ఎదిరించే సత్తాను అలవర్చుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సబ్ జడ్జి ప్రసాద్ మహిళలకు సూచించారు. స్థానిక నర్సింగ్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తజన గోదావరి



భక్తులతో పోటెత్తిన గోదావరి

ధర్మపురి: స్థానిక గోదావరి నది శనివారం భక్తజన సంద్రంగా మారింది. నృసింహుని బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అయితే, సరిపడా నీడ వసతి లేక చాలామంది మండుటెండ, చెట్లకింద, హోటళ్ల వద్ద సేద తీరారు.

నూలు డిపోలు రాలేదు.. కార్మికులు ఓనర్లు కాలేదు..



సిరిసిల్ల మానేరు వంతెనపై రేవంత్‌రెడ్డి యాత్ర



కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

- బీడీ కార్మికుల ఆస్పత్రి ఎందుకు కట్టలేదు
- కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఏమైంది
- నేరెళ్ల బాధితులకు పరిహారమేది
- సిరిసిల్లలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సిరిసిల్ల: సిరిసిల్ల నేతకార్మికులు సాంచాలపై కూలీ చేస్తున్నారని, బతుకమ్మ చీరలతో కొంతమంది పెద్ద సేట్లకు మాత్రమే లాభం జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి సిరిసిల్లలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ నుంచి సిరిసిల్ల పట్టణం వరకు పాదయాత్రగా వచ్చారు. సిరిసిల్ల నేతన్నచౌక్‌లో నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'సిరిసిల్లలో సభ అంటే.. కేటీఆర్ భయపడి ఎవరూ రారు అనుకున్నా. కానీ వారి బెదిరింపులకు భయపడకుండా.. ఇంత భారీగా జనం రావడం సంతోషంగా ఉందని' అన్నారు. సిరిసిల్లకు నూలుడిపోలు రాలేదని.. నేత కార్మికులు ఓనర్లు కాలేదన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉండగా.. మంజూరైన బీడీ కార్మికుల ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీని పూర్తి చేయకుండా.. కమీషన్లను మంత్రి కేటీఆర్ దండుకున్నారని ఆరోపించారు. 9వ ప్యాకేజీ పూర్తి చేస్తే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలు సస్యశ్యామలం అయ్యేవని.. కానీ కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్‌లు పూర్తి చేసి నీటిని తరలించుకుపోయారన్నారు. నేరెళ్ల దళితులను ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. ఇసుక లారీలకు అడ్డు వస్తున్నారని పోలీసులు కొడితే.. మంత్రి కేటీఆర్ ఆ కుటుంబాలకు ఎందుకు అండగా నిలువలేదని అడిగారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కె.కె.మహేందర్‌రెడ్డిని పక్కన పెట్టి కేసీఆర్ స్వార్థంతో తన కొడుక్కు సీటు ఇచ్చాడన్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ల్యాండు, సాండు, మైనింగ్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర రావడం లేదన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నిజాలు తప్ప అబద్ధాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల రాజయ్య, అంజన్‌కుమార్‌యాదవ్, బలరాంనాయక్, పొన్నం ప్రభాకర్, కెకె.మహేందర్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగుల సత్యనారాయణగౌడ్, చీటి ఉమేశ్‌రావు, అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ సందర్శన

సిరిసిల్ల పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించి, బాలికలతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మెనూ అమలుతీరు, వాష్‌రూమ్స్, వసతులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వడ్డించే భోజనాన్ని రేవంత్‌రెడ్డి పరిశీలించారు. బాలికలతో చాలా సేపు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణులో జోష్ పెంచింది.

క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌కు విద్యార్థినుల ఎంపిక

కథలాపూర్: మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థినులు కోరమాండల్ స్కాలర్‌షిప్ కు ఎంపికైనట్లు హెచ్‌ఎం మార్గం రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో అంబటి లాస్విక ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, కచ్చు సంగీతకు ద్వితీయ బహుమతిగా రూ. 3,500 చెక్కును కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అందజేశారు.

పాఠశాలల సందర్శన

మల్లాపూర్ : మండలంలోని ముత్యంపేట, రాఘవపేట, సిరిపూర్ జెడ్పీ హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలలను శనివారం జిల్లా పర్యవేక్షక బృందం సందర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలు, జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరాతీశారు. విద్యార్థులకు అందించే అల్పాహారం (స్నాక్స్)ను పరిశీలించి తగు సూచనలు చేశారు. జిల్లా పర్యవేక్షక బృందం గడ్డం శ్రీనివాస్ రెడ్డి, అభయ్ రాజ్, రాజోజీ పరమేశ్వర్, ఈగ శ్రీధర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్, నర్సయ్య, శంకర్, గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలపై మొసలికన్నీరు



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నాయకులు

జగిత్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడబిడ్డలపై మొసలికన్నీరు కారుస్తున్నాయని కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి విమర్శించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరాభవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు కట్టెలమోపు, వంటగ్యాస్ సిలిండర్లతో శనివారం ర్యాలీ నిర్వహించారు. వంటగ్యాస్ పెంపుతో సామాన్యుల బతుకులు భారమయ్యాయన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఇక కట్టెల పొయ్యే దిక్కయ్యిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆడబిడ్డలకు రూ.500కే వంటగ్యాస్ అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, దేవేందర్‌రెడ్డి, దుర్గయ్య, జీవన్, రాజేందర్, సరిత, రమ్య, సునీత పాల్గొన్నారు.

కొండగట్టులో జానపద దర్శకుడి పూజలు



స్వామివారిని దర్శించుకున్న అనంతరం దాముర్రెడ్డి, కళాకారులు

కొండగట్టు (చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని శనివారం జానదప దర్శకుడు కళాకారులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జానపద దర్శకుడు, సినిమా ప్రొడ్యూసర్ హైదరాబాద్‌కు చెందిన దాముర్రెడ్డి, కళాకారులు సృజన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కమ్లీ పటేల్, హరీశ్ తదితరులున్నారు.

నాణ్యతతోనే డిమాండ్

- కుర్కుమిన్ శాతం అధికంగా ఉండాలి
- ఎగుమతులకు ఇదేమంచి రకం
- పసుపు కమ్మర్‌పల్లి శాస్త్రవేత్తల సూచన
- పసుపు సాగుపై రైతులకు అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్: పసుపు సాగులో జగిత్యాల జిల్లా ప్రత్యేకత చాటుకుంటోంది. కానీ, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ఎగుమతుల్లో ఆశించినస్థాయిలో గుర్తింపు సాధించలేకపోతోంది. నాణ్యతా ప్రమాణాలు లేకపోవడమే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాదు.. కుర్కుమిన్ శాతం అధికంగా ఉన్న పసుపు రకాలు పండిస్తే దేశవిదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు అధికంగా వస్తాయని, తద్వారా రైతులకు గిట్టుబాటు లభిస్తుందని వివరిస్తున్నారు. ఈక్రమంలోనే జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ×సేంద్రియ పసుపు సాగు–మార్కెటింగ్ పద్ధతులు× అంశంపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్

పలు దేశాలకు ఎగుమతి..

- మనదేశం నుంచి ఇరాన్, యూఏఈ, జర్మనీ, జపాన్, బ్రిటన్, అమెరికా, శ్రీలంకకు ఏటా రూ.వేల కోట్ల విలువైన పసుపు ఎగుమతి అవుతోంది.
- కానీ, నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని, ప్రధానంగా రసాయన, పురుగుమందులు మోతాదుకు మించి వినియోగిస్తున్నారని ఆయా దేశాలు ఆరోపిస్తున్నాయి.
- మరోముఖ్య విషయం ఏమిటంటే.. చిన్న దేశాలు జమైకా, తైవాన్ అధిక కుర్కుమిన్ శాతం (6శాతం) గల పసుపు పండిస్తూ, మనకంటే తక్కువ ధరకు విక్రయించడంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడుతున్నాయి.
- దీంతో దేశీయంగా పసుపును అత్యధిక నాణ్యతా ప్రమాణాలతో పండించేందుకు శాస్త్రవేత్తలు రంగంలోకి దిగి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రపంచ దేశాల్లో పసుపు సాగు ఇలా..

దేశం	శాతం
భారత్	70
చైనా	8
బంగ్లాదేశ్	3.5
నైజీరియా	3
ఇథియోపియో	3.1
వియత్నాం	2
థాయ్‌లాండ్	2
భారత్‌లో రాష్ట్రాల వారీగా..	
తెలంగాణ	24
ఆంధ్రప్రదేశ్	22
తమిళనాడు	15
ఒడిశా	13
అసోం	6
మహారాష్ట్ర	4
కేరళ	4
కర్ణాటక	3
సిక్కిం	1

కుర్కుమిన్ శాతంపై దృష్టి



పసుపు సాగు చేసే రైతులు కుర్కుమిన్ శాతం ఎక్కువ ఉన్న రకాలు సాగు చేయాలి. ముఖ్యంగా ప్రతిభ, రోమ, రాజేంద్ర సోనియా, రాజేంద్ర సొనాలి, మెగ టర్మరిక్–1, లకడాంగ్, వైగాస్ వంటి రకాలు సాగు చేసుకోవచ్చు. ఈ రకాల్లో దిగుబడి హెక్టారుకు 35–39 క్వింటాళ్ల వరకు వస్తుంది.

– మహేందర్, పసుపు ప్రధాన శాస్త్రవేత్త, కమ్మర్‌పల్లి

జూన్‌లో సాగుచేయాలి



ఎండకాలంలో నేలను బాగా దున్ని, జూన్ మొదటి, రెండోవారంలో పసుపు నాటుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. ఎకరాకు 500–600 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనాన్ని తప్పనిసరిగ్గా రిడోమిల్ ఎంజెడ్ మందుతో విత్తనశుద్ధి చేస్తే తెగుళ్లు ఆశించవు. పంట కాలంలో నాలుగైదు సార్లు కలుపు తీయాలి.

– పులి శ్రీనివాస్, పసుపు శాస్త్రవేత్త, కమ్మర్‌పల్లి

సేంద్రియ సాగు లాభదాయకం



సేంద్రియ పద్ధతిలో పసుపు సాగు లాభదాయకం. సేంద్రియతోపాటు తక్కువ మోతాదులో రసాయన ఎరువులూ వినియోగించినా అధిక దిగుబడి వస్తుంది. చివరి దుక్కిలో పేడ, నల్లమట్టి వేసి కలియదున్నాలి. 40 రోజుల పంట కాలంలో వేపపిండి, యూరియా వేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయి.

– స్పందన, ఉద్యాన శాఖ అధికారి

వెయ్యి ఎకరాల్లో సాగు



మా కంపెనీకి చెందిన రైతులు దాదాపు వెయ్యి ఎకరాల్లో పసుపు పండిస్తున్నారు. అయితే, ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంలేదు. గిట్టుబాటు కావడంలేదు. ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని ఉద్యాన శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

– పన్నాల తిరుపతిరెడ్డి, అధ్యక్షుడు, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, లక్ష్మీపూర్

మార్చి 8న ఆరోగ్య మహిళా కేంద్రాలు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: మహిళలు వ్యాధులబారిన పడకుండా ముందస్తుగా పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించేందుకు ప్రభుత్వం మార్చి 8 నుంచి ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మంగళవారం మహిళలకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటుతో చనిపోతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చామని తెలిపారు. సీపీఆర్‌పై శిక్షణ అందించేందుకు ప్రతి జిల్లాలో 5–7 మాస్టర్ ట్రైనర్లను అందుబాటులో ఉంచి 300 మందికి శిక్షణ అందించేలా కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. ముందుగా 100 ఆరోగ్య కేంద్రాల్లో మహిళ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్‌సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో ఈ క్లినిక్‌లు ఏర్పాటు చేసి మహిళలకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు లత, మకరంద్, జిల్లా ఎస్పీ భాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో వాలంటీర్లు

ధర్మపురి/ జగిత్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో కొనసాగుతున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ దళాలు ప్రత్యేక సేవలందిస్తున్నాయి. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పడాల తిరుపతి, ఎన్‌సీసీ ఇన్‌చార్జి కె.రవికుమార్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు సేవలందిస్తున్నారు. బ్ర హ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన కలెక్టర్ యా స్మిన్‌బాషా విద్యార్థులను ప్రత్యేకంగా అభినంధించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మపురి సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..




హోలీ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్

- సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారు
- తెలంగాణపై సీఎం కేసీఆర్‌కు ప్రేమలేదు
- రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సారంగాపూర్(జగిత్యాల): తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సీఎం కేసీఆర్.. తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. జగిత్యాల, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో శనివారం యాత్ర చేపట్టారు. ఆదిలాబాద్ వెళ్లే క్రమంలో కోనాపూర్‌లో పార్టీ కార్యకర్తలను కలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులవుతూ ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధిపై తాము బహిరంగ చర్చకు ఆహ్వా నిస్తే సీఎం ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ప్రతీ కార్యకర కష్టపడి పార్టీ విజయానికి కృషిచేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా లంబాడీ మహిళలు నిర్వహించిన హోలీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి, నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి, చిలుకమర్రి మదన్‌మోహన్, పన్నాల తిరుపతిరెడ్డి, ఎండబెట్ల వరుణ్‌కుమార్, మ్యాడ జనార్దన్, దీటి వెంకటేశ్, ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్, భూమ్ల మార్కండేయ, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

జగిత్యాల జోన్ : మద్యంతాగి వాహనాలు నడిపిన 42 మందికి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యంతాగి వాహనాలు నడిపిన 42 మందిని శనివారం కోర్టులో హాజరుపర్చగా వారికి రూ.44 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అంతకుముందు వారికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

నకిలీ ఏజెంట్లను ఆశ్రయించొద్దు

- ఎస్పీ భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాల: విదేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారు నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏజెంట్లనే ఆశ్రయించాలని ఎస్పీ భాస్కర్ అన్నారు. స్థానిక పోలీసు కార్యాలయంలో ప్రభుత్వ ఆమోదిత 25 గల్ఫ్ ఏజెన్సీలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, నిరుద్యోగులు లక్ష్యంగా నకిలీ గల్ఫ్ ఏజెంట్లు.. విజిట్ వీసాలతో మోసం చేస్తున్నారన్నారు. గల్ఫ్ వెళ్లాక కంపెనీ వీసా కాదని తెలిసి అనేక కష్టాలు పడి తిరిగి స్వదేశానికి వస్తున్నారని తెలిపారు. ఇలా ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి నిందితులపై కేసు నమోదు చేస్తామని, ఏజెన్సీ గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని వెల్లడించారు. అవసరమైతే పీడీయాక్ట్ నమోదు చేస్తామని వివరించారు. ఇప్పటికే జిల్లాలో 10 మంది నకిలీ ఏజెంట్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసకున్నామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, ప్రకాశ్, ఎస్పీ సీఐ రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసునమోదు చేశారు. ఎస్సై అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 15న ధర్మపురి మండలం దోనూర్ గ్రామానికి చెందిన సంగ మారుతి తల్లి లావణ్య, సోదరితో కలిసి బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు ద్విచక్రవానంపై వెళ్తున్నారు. బీర్‌పూర్ శివారులోని సిరిపురం కాలువ వద్ద నర్సింహులపల్లె గ్రామానికి చెందిన యశోద లక్ష్మణ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. లావణ్య ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతీ కూలీకి 'ఉపాధి'

మల్లాపూర్(కోరుట్ల): ఈజీఎస్ పనులు గుర్తించి, ప్రతీ కూలీకి ఉపాధి కల్పించాలని డీఆర్డీవో ఏపీడీ శివాజీ సూచించారు. సాతారంలో చేపట్టి న ఈజీఎస్ పనులను ఆయన శనివారం పరి శీలించి పలు సూచనలు చేశారు. వేసవిలో ఉ పాధి పనులకు వచ్చే కూలీలకు అదనంగా రూ. 20 చెల్లించనున్నట్లు తెలిపారు. ఈజీఎస్ ఏపీవో సతీశ్, సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

జగిత్యాలజోన్ : అర్ధరాత్రి రోడ్లపై తిరిగే యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని పోలీసులు ఆపరేషన్ చబుత్రలో భాగంగా 48 మందిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీలు నిర్వహించి అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ, అనుమాస్పదంగా కనిపించిన యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ పలువురి ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వదిలిపెట్టారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



స్నేహలతను సన్మానిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ వసంత, ఐసీడీఎస్ సిబ్బంది

పెగడపల్లి: మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ చైర్మన్ స్నేహలత, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కుటుంబ విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడంలో ముందుండాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ, ఐకేపీలో ఉత్తమ సేవలందిస్తున్న సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శోభ, సర్పంచి శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి, ఎంపీటీసీలు జమున, అనసూర్య, డీపీఎం మాణిక్‌రెడ్డి, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు జమున, సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సరోజన, ఏఎంసీ చైర్మన్ నిర్మల, వైస్ ఎంపీపీ గంగాధర్, ఆర్బీఎస్ మండల చైర్మన్ నరేందర్ రెడ్డి, ఏపీఎం సమత, వివిధ గ్రామాల సర్పంచులు, మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

- కాలిబూడిదైన రూ.2 లక్షల నగదు

కథలాపూర్(వేములవాడ): ఊటిపెల్లి గ్రామంలోని శ్రీగద్దె ప్రకాశ్ ఇల్లు శనివారం మధ్యాహ్నం ప్రమాదవాశాత్తు నిప్పంటుకుని కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నట్లు పేర్కొంటున్నారు. ప్రకాశ్ తన ఇంట్లోనే చీరెల విక్రయ దుకాణం నిర్వహిస్తుండగా... రూ.1.50 లక్షల విలువైన చీరెలు, లుంగీలు కాలిపోయాయి. ఇదే ఇంట్లో అద్దెకు ఉంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మేస్త్రీ వేముల సంతోష్‌కు చెందిన రూ.2 లక్షలు నగదు, 2 తులాల బంగారం కాలిబూడిదైనట్లు బాధితుడు ఆవేదన చెందాడు. ఫైరింజన్ వచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చింది. సంఘటన స్థలాన్ని ఆర్‌ఐ నాగేశ్ పరిశీలించి బాధితులను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు, ఆభరణాలు..

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి శివారు గ్రామం పుల్లయ్యపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లోని నిత్యావసర వస్తువులతోపాటు ఇతర సామగ్రి దగ్ధమైంది. గ్రామానికి చెందిన అడువ అనసూర్య పొలం పనులకు వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో మంట లు వ్యాపించి ఇంటి పైకప్పుతో పాటు నగదు, మూ డు క్వింటాళ్ల పత్తి, బంగారు ఆభరణాలు, నిత్యావసర వస్తువులు, దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ సాయంతో మంటలనార్పారు. ఘటనా స్థలాన్ని ఆర్‌ఐ అనిల్ సందర్శించారు.

విద్యార్థిని ఉన్నత చదువుకు చేయూత

ధర్మపురి : ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్థోమత ఓ విద్యార్థినిని స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం చేరదీసింది. ధర్మపురికి చెందిన గొల్లపెల్లి గణేశ్ వృత్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. చదువుల్లో ర్యాంకులు సాధించి ఉన్నత ఉన్నత చదువుకోసం ఆర్థిక స్థోమత లేని విద్యార్థుల కోసం విద్యార్థి దత్తత కార్యక్రమాన్ని ఏర్పాటు చేపట్టారు. ధర్మపురికి చెందిన మసీదు మేఘనకు అనస్థీషియా టెక్నాలజీ కోర్సులో నిజామాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. తల్లిదండ్రులకు చదివించే స్థోమత లేకపోవడంతో విద్యార్థిని స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రామ్ కన్వీనర్ గొల్లపల్లి గణేశ్ ఆధ్వర్యంలో ధర్మపురికి చెందిన ఎన్‌ఆర్‌ఐ కోజ్జుల చంద్రశేఖర్ విద్యార్థి చదువుకు అవసరమయ్యే రూ.30 వేలు శనివారం అందజేశారు. నాలుగు సంవత్సరాలకు రూ.లక్షా 20 వేలను చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా దాత చంద్రశేఖర్‌కు, ప్రోగ్రామ్ కన్వీనర్ గణేశ్‌కు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న మైనింగ్, రెవెన్యూ ఆర్‌ఐలు

మల్లాపూర్ : ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని మైనింగ్, రెవెన్యూ ఆర్‌ఐలు నిర్మల, రాజేశ్ హెచ్చరించారు. శనివారం మండలంలోని వాల్గొండ శివారులో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న 6 ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గోదావరి నది, పెద్దవాగు నుంచి కొందరు ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ, మైనింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కువైట్‌లో యువకుడి మృతి

- నాలుగురోజులకు స్వగ్రామానికి మృతదేహం

మల్లాపూర్ : ఉపాధి కోసం వెళ్లి అనారోగ్యానికి గురై నాలుగు రోజులకింద యువకుడు మృతిచెందగా శనివారం స్వగ్రామానికి చేరింది. మల్లాపూర్ మండలం..ఒబులాపూర్ గ్రామానికి చెందిన గడ్డం పోశయ్య–గంగరాజు దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు గడ్డం శంకర్ (35)కు పదేళ్ల క్రితం లతతో వివాహం జరిగింది. ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ పని ఒత్తిడితోపాటు అనారోగ్యానికి గురయ్యాడు. తోటి కార్మికులు శంకర్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 1న మృతిచెందాడు. శంకర్ మృతిచెందిన విషయాన్ని అక్కడినుంచి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. కువైట్‌లోని ఎంబసీ అధికారులు, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ ప్రత్యేక చొరవతో శంకర్ మృతదేహం నాలుగు రోజులకు స్వగ్రామానికి చేరుకుంది.

వివాహిత ఆత్మహత్య

- ఏడునెలల క్రితమే ప్రేమవివాహం

కోరుట్ల రూరల్ : మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన మమత (25) అలియాస్ తిరదోస్ తబస్సీన్ అనే వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మమత భర్త రాజేశ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాజేశ్ హైదరాబాద్ వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమర్టం కోసం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ కుమార్ తెలిపారు.

ఏడు నెలల క్రితమే వివాహం..

జగిత్యాలకు చెందిన మమతకు అయిలాపూర్‌కు చెందిన రాజేశ్ ప్రేమించుకున్నారు. మమత తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో పారిపోయి ఏడునెలల కింద ప్రేమవివాహం చేసుకున్నారు. అయిలాపూర్‌లోనే ఓ ఇంట్లో వేరే కాపురం పెట్టారు.